# 23. మారే మనుషులు

మూసిన తలుపుల వెనుక, నాలుగు గోడల మధ్యా ఏకాంతవాసంలో వుంది మీనాక్షి. దక్షిణపు వైపు కిటికీలోంచి మెల్లిగా చల్లగా వీచే గాలి ఆమెకు వడగాడ్పుగానే వుంది. పక్కమీద పడుకున్నా, గదిలో ఇటూ అటూ తిరిగినా, కుర్చీలో కూర్చున్నా, గోడ కానుకొని నిలబడినా, ఎట్లా చేసినా ఆమెకు సుఖంగా లేదు. పైన తిరిగే సీలింగ్ ఫాన్‌ను కసికొద్దీ ఆపేసింది. పక్కంతా చిందర వందరై, తను పొందిన ఆవేదనకు సాక్ష్యమిస్తోంది; తడిసిన తలగడా తను అనుభవించిన దుఃఖాన్ని తెలియ చెపుతోంది.

గత సాయంత్రం నుంచీ మీనాక్షి యీ గదిలోనే తలుపులు బిడాయించుకొని గడిపింది. ఇది కారాగార వాసంలాగే తోచిందామెకు ... ఎన్నేళ్లు ఇందులో గడిపిందోననిపిస్తోంది. తిండిలేదు. తిప్పలులేవు. నిద్ర లేదు; మనశ్శాంతిలేదు. ఎంత కన్నీరు కార్చినా హృదయభారం తగ్గదు. పదిహేడేళ్ళ జీవితానంతరం మొదటిసారి ఏడవటం ఎంత కష్టం! ఏళ్ళ తరబడి పేరుకొని, ఘనీభవించిన కన్నీరు విడుదలవటం మాటలా? యిప్పటికి సగమన్నా తేలికై ఉండవలసింది. కాని తన కన్నీరు ఇంకా ఎంతో వున్నదనిపిస్తోంది.

గంట గంటకూ తండ్రి వొచ్చి గదవతల నుంచి బతిమాలుతూనే వున్నాడు. తన షరతు లన్నిటికీ ఒప్పుకునే ధోరణే కనబరుస్తున్నాడు. తన స్థితికి ఆయనకూడా బాధపడుతూ, దుఃఖిస్తున్నాడు. ఐనా తనకు మనసు కరగలేదు.

ఉదయం కాఫీ కప్పుతో గది కిటికీ దగ్గిరికొచ్చి కాఫీ తాగమని బతిమాలాడు! కాదు ప్రార్థించాడు. ఆయన మొహంలో, తన ముఖకళే కనిపించింది. ఎంతో

జాలివేసింది: కాని లొంగలేదు. ఇది మామూలు అలకైతే రాత్రే లొంగిపోయేది....కాని తన జీవిత సౌఖ్యాన్ని కడుపులో దాచుకున్న సమస్యాయె! నిరశనవ్రతంద్వారా భారతీయ నాయకులు సాధించిన ఫలితాలు, భారతీయ కన్యయిన మీనాక్షి నర నరాల్లోనూ వున్న రక్తాన్ని ఉద్రిక్తపరిచింది. అదీగాక, అబల ఐన తనకు ఇంతకన్న మార్గమేమిటి?

ఇన్నిసార్లు తండ్రి వొచ్చాడు కాని, తల్లి మాత్రం రాలేదు. కనీసం తను ఏమైందో, ఎలావుందో తెలుసుకునే కుతూహలంకూడా తల్లికి లేనట్లుంది. ఆడపిల్లకు తల్లికన్న ఆప్తులెవరు? నిజానికి తన తల్లే తనకు అండగా ఉండవలసింది. అలాటిది ఆమె తనకు ఆజన్మ విరోధివలె ప్రవర్తిస్తోంది. అసలీ గొడవంతా ఆ తల్లి వల్లనేకదా!

కాలం గడుస్తూన్నకొద్దీ మీనాక్షిలో పట్టుదల అధికమవ సాగింది. ఒక పక్క మానసికాందోళన, మరోపక్క ఆకలితో నకనకలాడే దైహిక బాధాను. యీ రెండిటిమధ్యా ఆమె నలిగి నల్లేరయింది. యీ తాత్కాలిక బాధలకు కాస్త ఓర్చుకుంటే గమ్యస్థానాన్ని జేరొచ్చనీ, తన ఆదర్శాన్ని సాధించి జయించగలననే మనోబలం వొక్కటే ఆమె పట్టుదలను రెండింతలు చేస్తోంది.

తనలో చాలా మార్పువొచ్చి ఉండాలి. అద్దంముందుకు వెళ్ళి తన ప్రతిబింబాన్ని చూసుకుంటే భయం వేసింది. అద్దంలో కనబడే ఆమె తనకు కలలో కనిపించినట్లయితే, అది తప్పకుండా పీడకలే అయేది! ఒక రాత్రి ఒక పగటిలోనే సంవత్సరాలు గడిచి, కాలచక్రం తాలూకు క్రౌర్యమంతా మొహంలోనే కనిపిస్తూన్నట్లుంది. తనెంత దీనంగా, జాలి గొలిపేట్లు కనిపిస్తోందో! అమ్మ ఒక్కసారి తన యీ స్థితిచూస్తే తప్పకుండా జాలి పడుతుంది. మరి రాదేం?

విడుదల కోసం క్షణాలు యుగాలుగా గడిపే జన్మాంతం ఖైదీవలె ఆతృత పడసాగింది. యీ గోడలు మధ్యలో తనను వుంచి అన్ని వైపుల నుంచీ వొత్తుతూన్నట్లనిపిస్తోంది. కప్పు మీదికిదిగుతూన్నట్లుంది. ఊపిరాడనంత బాధ, గుంజాటన అనుభవిస్తోంది... తను బైటికి పోవాలి. ప్రపంచమంటే యీ గదికాదు. చాలా వుందనే నమ్మకం కలిగేట్లు అన్ని వైపులకూ పరుగెత్తాలి. చచ్చిపోయినప్పటికీ తానీ బోనులో కుళ్ళి చావలేదు: విశాల విశ్వంలో చావాలి! కాని తన విముక్తి ఇంకా కనుచూపు మేరలో కూడాలేదు.

బంగళా అంతా నిశ్శబ్దంగా వుంది. భరించలేనంత నిశ్శబ్దమది! శబ్ద రహితంగానే ముఖ్యమైన మూడు ప్రాణాలూ వేరు వేరు తావుల్లో మురిగి పోతూన్నవి. ఎవరి బాధ వారిదీ. ఐతే అందర్నీ వేధించేది ఒక్కటే సమస్య.

ఏదన్నా ప్రమాదం, అవాంతరం జరుగుతే బాగుండు ననిపించింది మీనాక్షికి. భూమి బద్దలైతే, లేదా దూరానవున్న ఆ కొండ నడిచి యీ బంగళావైపు వొస్తే, లేదా

నదిపొంగి, వరదలో యీ బంగళా మునుగుతే - ఏ ఎలక్ట్రిక్ షాక్ తగిలన్నా బాధతో ఎవరన్నా అరుస్తే, ఏదో వొకటి ప్రాణగండంలాంటిది జరుగుతేనే తప్ప యీ అవస్థలోనుంచి తను బైట పడేట్లు లేదు.

హాలులో మాటలే వినిపించవు. నాన్నా అమ్మా అసలు మాట్లాడుకుంటున్నారా, లేక తనకు దూరంగా ఎక్కడన్నా చర్చిస్తున్నారా! వాళ్ళు హాల్లో మాట్లాడుకొని, ఉద్రేకంలో పోట్లాడుకొని, కాట్లాడుకుంటే బాగుండును. పగలబొయ్యే అగ్నిపర్వతం దగ్గిర పడిగాపులు గాయటంలాగుంది తన పని. అగ్నిపర్వతం త్వరగా బద్దలై, విడుదలచేసే లావా ఏదో చూసుకోవచ్చు. ఎంతసేపు వేచి కూర్చొని, ఎంత ఆతృతతో వున్నప్పటికీ ఫలితం శూన్యం. యీ కాలంకూడా తనలాగే, తన మీద అలిగి కదలక మెదలక పడివుందేమో?

హఠాత్తుగా సావిట్లో మాటలు వినిపించినవి. మీనాక్షి చాలా ఆతృతతో వినసాగింది. ఖూనీ నేరానికి విచారించబడే ఖైదీవిషయంలో జ్యూరీ ఆలోచించుకొని వొచ్చాక, ఖైదీపొందే తహ తహ లాటిది ఆమెను ఆవరించింది.

"ఒక్కగాని ఒక్క పిల్ల; దాని మాట కాదని దాన్ని బాధపెట్టడం దేనికి? ఒప్పుకో-" ఇది తన తండ్రి కంఠం.

"వీల్లేదు; నేను నిన్ననే చెప్పానుగా...ఎవడో వూరూ పేరూ లేనివాడు, వెనక ఎవ్వరూలేని ఒంటరివాడు, బీదవాడికి నా పిల్లనివ్వను" ఇది తన తల్లి కంఠం; ఎంత కఠినంగా, క్రూరంగా ధ్వనిస్తోంది!

"ఉద్రేకం తగ్గించుకొని ఆలోచించు శ్యామా! మీనాను అతను పెళ్లాడటంతో అతనికి ఊరూ పేరూ వస్తవి. మనతోపాటు మన బంధువులూ, అతని బంధువులైతే అతని ఒంటరితనం పోతుంది. మన యీ ఆస్తిపాస్తులన్నీ అమ్మాయికీ అతనికీ సంక్రమిస్తవి. కనుక, బీదతనంకూడా వొదలుతుంది... యీ నిరాధారుడికిస్తే, మన యింటేనే వుండి, జీవితాంతం వరకూ భయభక్తులతో, విశ్వాసంతో వుంటాడు. అన్నిటికన్నా ముఖ్యం మీనా సుఖపడుతుంది. పరాయి ఇంటికి పోనక్కర్లేదు-"

ఎంత బాగా, తెలివిగా చెప్పాడు నాన్న! నాన్న శాంతమూర్తి; లోతులకు ఆలోచించగలడు; తనంటే ప్రాణసమానంగా చూస్తాడు...కాని అమ్మ బ్రిటిష్ రాజ్ఞిలాటిది. ఇంట్లో అధికారాలన్నీ ఆమెకేకాని, తండ్రికి పలుకుబడిలేదు, తనలాగే అమ్మకుకూడా తగని పట్టుదల. ఆమె ప్రతీదీ నెగ్గించుకుంటుంది. నాన్నకూడా ఇట్టే లొంగిపోతాడు. అలాటిది యీ విషయంలో మాత్రం నాన్న తన పక్షాన ఉండి, ఎలాగైనా అమ్మనే వొప్పిద్దామని విశ్వప్రయత్నం చేస్తున్నాడు. ఇలాటి నాన్నను చూసి ఏ బిడ్డ మురిసిపోదు?

"నేను అంతా ఆలోచించాను...మనమేం కట్నాలుపోసి మంచి సంబంధాలు తేలేని వాళ్ళమా? వాడు - ఆ చలపతి అసలు అమ్మాయి కోసం కాకుండా, యీ

ఆస్తికోసమే ప్రేమిస్తున్నా డనుకోకూడదా? భార్యను పోషించుకోలేని దద్దమ్మ వాడు...ఆడపిల్ల కళ్ళ ఎదుటే వుండాలనుకుంటే వూళ్ళో సంబంధమే చూడొచ్చు.... ఆ రాజారావు లేడూ – అతనూ దీని చెంగుపట్టుకొని వేళ్లాడుతున్నాడుగా! అతనికివ్వండి – నాకేం అభ్యంతరంలేదు" అంది అమ్మ.

ఒక పక్క చలపతీ, మరో పక్క రాజారావూ తన కళ్ళ ఎదుట సాక్షాత్కరించారు. ఒక్క డబ్బులో తప్ప రాజారావు మరి దేంట్లోనూ చలపతికి సాటిరాడు. రాజారావంటే మొదటినుంచీ తనకు మంటే! వాడు తనను ప్రేమించి ఉండుగాక, మరి తన మనసు చలపతి మీదనే లగ్నమైంది. చలపతి! ప్రాణత్యాగానికైనా తను సిద్ధపడగలదు కాని, చలపతిని వొదులుకోలేదు. యీ అమర ప్రేమను తల్లి గ్రహించదేం? ఆమె తలలోని మరలు పనిచెయ్యడం లేదా?

"రాజారావు మాత్రం తన ఆస్తిపాస్తుల కోసం ఆశ పడుతున్నాడని ఎందు కనుకోకూడదు?" అన్నాడు నాన్న. మనసులో నాన్నకు ధన్యవాదాలు అర్పించుకుంది. యీ అలక చెడుతుంది కాని లేకుంటే నాన్నను కావలించుకొనేదే!

"ఏళ్లొచ్చినకొద్దీ మీకు మతిపోతోందేం? రాజారావుకు బోలెడు వుంది. అతను మన ఆస్తిపాస్తులకోసం ఆశపడటం ఏంఖర్మం?"

"మనకూ బోలెడు వుంది; మరి మనం ఎందుకు ఆశపడుతున్నాం? ఆ చలపతికి మన ఆస్తిపాస్తులే గొప్ప ఆకర్షణ అవుగాక. అందువల్లనన్నా పడివుంటాడు కదా! అమ్మాయికి నచ్చవలసింది వరుడు కాని, అతని భోగభాగ్యాలు కావుగా–"

నాన్న తన న్యాయవాద వృత్తిలోని ప్రతిభ నంతనూ చూపుతున్నాడు – తనకు న్యాయం చేయాలని! ఇంత గొప్పగా మాట్లాడగలడు కనుకనే, నాన్నకు అంతపేరు! యీ వాదనకు ఎంత కఠినుడైన న్యాయమూర్తి ఐనా ఇట్టే కరిగి, లొంగిపోతాడు కాని, తన తల్లిమాత్రం మొండి కేస్తుందని తెలుసు. మొండివాడు రాజుకన్నా బలవంతుడాయె!

"నాకు తలనొప్పి తెప్పిస్తారెందుకు? దమ్మిడీకి పనికిరాని యీ వాదాలతో నాకు నిమిత్తం లేదు. అది నా కూతురు, దాని సుఖం నాకు అక్కర్లేదా? మీరు ఏం చెప్పినా నాకు నచ్చదు."

"శ్యామా! నీవు ఆలోచించటంలేదు. అమ్మాయి చేయరాని పని చేయబోతోందనే కోపంలో వున్నావు. ప్రపంచం మారింది; సంస్కారం పులుముకొని బతుకుతున్నా మనుకుంటూన్న మనం, సాధారణ విషయాలకు లొంగిపోవటం ఏమిటి? మనమూ ప్రపంచంతోపాటు మారాలి. యీ రోజుల్లో ప్రేమ వివాహాలు–"

"ప్రే-మ" అందామె. రెండక్షరాలకూ మధ్యలో వికృతంగా సాగదీసి "యీ ప్రేమలు నాకూ తెలుసు. అసలు దాని యీడులో ప్రేమకు అర్థం తెలుసా? మూడు

రోజుల్లో చప్పగా చల్లారే యీ ప్రేమ కోసం దాంతోపాటు మీరుకూడా గజ్జకట్టుకొని చిందులేస్తున్నారు - అంతే!"

ఎదుటివ్యక్తి వాంఛల్నీ, అనురాగాల్నీ ఎంత తేలిగ్గా మాట్లాడి నీచపరచ గలుగుతుందో అమ్మ! అమ్మకు తను బాగా తెలిసి ఉండొచ్చు. కానీ తన హృదయం అర్థంకాలేదు. ఆమె కోరే తాహతు, సమాజంలో గౌరవం, అంతస్తు వీటికోసమే ఆమె పాకులాడుతోంది. ఇవి అక్కర్లేదని కాదు కాని, వీటిని సాధించటంలోనే జీవితమంతా గడుస్తే, మరి సుఖపడే దెప్పుడు? ఎట్లా?

"చాలా దారుణంగా మాట్లాడుతున్నావ్ - శ్యామా! నిన్న రాత్రి నుంచీ మీనా పచ్చి మంచినీళ్ళన్నా ముట్టలేదు..." అని బతిమాలుతున్నాడు నాన్న.

"నేనూ ముట్టలేదు. నా సంగతి ఎవరన్నా కనుక్కున్నారా? యీ వెధవ అలకలకేం వొచ్చె? యవ్వనోద్రేకంలో ఒక్కసారి పొరబడితే చాలు, మళ్ళీ సరిదిద్దుకోవటం కుదరదు....మీరు అనవసరంగా వాదించవొద్దు. నా కంఠంలో వూపిరుండగా నేను యీ పెళ్ళికి వొప్పుకోను. మీరూ, మీ కూతురూ మీ యిష్టం వొచ్చినట్లు చేసుకో దలచుకుంటే, ముందు నన్ను చంపండి... అంతే... చంపెయ్యండి ...అట్లా చూస్తారేం... చంపండి!"

అమ్మ ఎంత వుద్రేకంతో వూగిపోతూండి వుంటుందో, ఆ కంఠస్వరం, దానిస్థాయీ వింటేనే ఇట్టే తెలుస్తోంది. బరువుగా నేల మీద ఏదో పడిన చప్పుడైంది. ఆ కోపంలో అమ్మ ఏదన్నా వస్తువు నాన్నమీదికి విసిరివేసి గాయపరచలేదుకదా! ఆ చప్పుడుకు గుండెల్లో భూకంపం జరిగినంతగా, వొళ్ళంతా ఝల్లుమని, ఏదో అతి శీతల ప్రవాహం ప్రసరించినది.

"ఒరేయ్ - వెంకడూ! సుబ్బడూ!... ఎక్కడ చచ్చార్రా... రండిరా" అని నాన్న కేక వేస్తున్నాడు. ఏదో ప్రమాదమే జరిగి వుండాలి. చాలా ఆతృతతో, బరువుగా పరుగెత్తుతూన్న కాళ్ళ చప్పుళ్ళు వినిపించినవి. ఇప్పటికిప్పుడు తేలని తన సమస్యపోయి, దానిస్థానే సావిట్లో ఏంజరిగిందో తెలుసుకోవాలనే ఆతృత హెచ్చయింది. కాని వ్రతం - వెధవ పట్టుదల - తన కాళ్ళను కట్టివేసింది.

తలుపుమీద చిన్న చప్పుడు. తర్వాత నాన్న గొంతుకు :

"మీనా!... రా తల్లీ! .... అమ్మకు ఫిట్ వొచ్చింది ... స్పృహ లేకుండా పడిపోయింది. రావే అమ్మా!.... మా అమ్మవు కాదూ?" బతిమాలుతున్నాడు. అమ్మకు ఫిట్ వొచ్చిందనగానే భయం వేసింది. యీ విధంగా రెండేళ్ళనుంచీ అప్పుడప్పుడు జరుగుతూనే వున్నప్పటికీ, ఇప్పటి ఫిట్ చాలా ప్రమాదకరమైందై వుంటుందని తోచింది. కాళ్ళు వొణికినయ్. ఎలాగో నిలవతొక్కుకొని గది తలుపు తెరిచింది.

నాన్న మొహం చూసేందుకు సిగ్గేసి, సరాసరి అమ్మ దగ్గిరికి పరుగెత్తింది. తివాసీమీద స్పృహలేకుండా వెల్లకిలా పడివుంది అమ్మ. తల కింద రెండు మెత్తని దిళ్ళు ఉన్నవి. పైన గిరగిరా తిరిగే ఫేన్ గాలికి ఆమె మొహంమీద ముంగురులు నాట్యం చేస్తున్నవి. లోన బద్దలైన అగ్ని పర్వతం తాలూకు లావాలవేడి, ఆమె విడిచే ఆవిరి పొగల గాలిలో తెలుస్తూనే ఉన్నది. అమ్మను కదిపిచూసింది... ఉహుఁ, ఆమెలో చలనం లేదు. ఏమౌతుందోనన్న భయం. తనేమీ చేయలేని నిస్సహాయ స్థితిలో చుట్టూవున్న దాసదాసీలవంకా, నాన్నవంకా, సావిట్లో వేలాడే బొమ్మల వంకా చూసింది. నాన్నకూడా నిస్సహాయంగా తన వైపే చూస్తున్నాడు. తన వల్లనే ఇంతా జరిగిందనే భావం మీనాక్షిని మరింత కుంగదీసింది.

తన పక్కనే కూర్చుంటూ "డాక్టర్‌కోసం కబురు చేశాను. మరేం ఫర్వాలేదు" అన్నాడు నాన్న, తన ముంగురుల్ని పైకి సర్దుతూ. ఏమిటో అంతా వెగటుగా, వికారంగా వుంది.

కాలంతోపాటు మనుషులు కూడా స్తంభించిపోయినట్లు ఎవరూ కదలటంలేదు; అసలు గాలి పీలుస్తున్నారా లేదా అన్నట్లు నిశ్చేష్టులై, అందరూ ఆ ఇల్లాలి వైపే చూస్తున్నారు. అరగంట గడిచాక డాక్టర్ వొచ్చాడు; డాక్టర్ వొచ్చాక మనుషుల్లో మళ్ళీ చలనం కలిగింది.

"ఫిట్ వొచ్చింది –" అన్నాడు నాన్న.

డాక్టర్ పరీక్ష చేశాడు. బ్లడ్ ప్రషర్ చూశాడు. ప్రశ్నార్థకంగా నాన్న మొహంలోకి చూశాడు.

"మెల్లిగా మంచం మీదికి జేర్చండి. బ్లడ్ ప్రషర్ కూడా బాగా వుంది... నేను చెప్పానుకదా, యీమె ఉద్రేకాలకు గురి కాకూడదని. ఏదో తీవ్రమైన ఉద్రేకంతోనే అలా పడిపోయింది–" అన్నాడు డాక్టర్.

నలుగురూ సాయంపట్టి అమ్మను గదిలోని మంచం మీదికి జేర్చారు. డాక్టర్ ఇంజక్షన్ ఇచ్చాడు;

"రోగి చాలా అలసి వుంది. శరీరంలో త్రాణ లేనట్లు నరనరాలూ వొణుకుతూన్నవి... ఏమన్నా అస్వస్థతగా వుందా?" అన్నాడు డాక్టర్.

డాక్టర్‌కు అర్థమయేట్లు చెప్పటం ఎలాగో తెలియక, నాన్న అనుమానించి, మెల్లిగా అన్నాడు :"ఏంలేదు... ఏవో ఆలోచనల్తో వేగిపోతోంది. నిన్న సాయంత్రంనుంచీ పచ్చి మంచినీళ్ళు కూడా ముట్టలేదు."

"అసలే అనారోగ్యం; దానికితోడు ఆహారం లేకుండటం, ఆపైన అనవసర ఉద్రేకాలూను... చాలా జాగ్రత్త అవసరం...మందు పంపుతాను. స్పృహ వొచ్చాక

కాస్త ఓవల్టిన్ ఇవ్వండి. జ్వరంకూడా వుంది. రోగి మనస్సు కనిపెట్టి ప్రవర్తించాలి..... రేపు వుదయం వొస్తాను-"

డాక్టర్‌ను సాగనంపేందుకు నాన్న వెంట వెళ్ళాడు. అమ్మ స్థితి చూస్తే జాలేసింది. ప్రియుడా, అమ్మా అంటే, అమ్మనే కోరుకోవాలి మతివున్న తను! యీ క్షణంలో ప్రియుణ్ణి వొదులుకోవటం చాలా సామాన్య విషయంగా తోచింది. యీ ప్రమాదం ఒక్కసారిగా కఠినతమమైన సమస్యను నవనీతమల్లే చేసింది. అమ్మ వొళ్ళుముట్టుకుంటే, మండే కుంపటిమీద చెయ్యివేసినట్లుంది. తనకోసం తన సౌఖ్యంకోసం, తన క్షేమాన్ని ఆలోచించే అమ్మ యీ స్థితికి వొచ్చింది. యీ వెధవ పట్టుదలల కారణంగా ప్రశాంతమైన జీవితంలోకి యీ తుఫాను వొచ్చిపడింది. ఎవరో ఒకరు, అకారణంగానే ఔగాక, త్యాగంచేస్తే సరిపోతుంది. నాన్న రాగానే దీనంగా, బాధగా 'నాన్నా!' అని ఆయన మొహంలోకి చూసింది మీనాక్షి. ఆయన మొహం కూడా కళకాంతులు లేక వెల వెలబోతోంది:

"ఏంలేదమ్మా! మరో గంటలో స్పృహవొస్తుంది. భయంలేదు" అన్నాడాయన. అన్నాడు కాని, ఆయన మొహంలోనూ ధైర్యంలేదు.

అలాగే అమ్మ దగ్గిర కూర్చుంది. తన యీ ప్రణయం ఇంతఘోరంగా కన్నీటికి కారణమౌతుందని ఎన్నడూ అనుకోలేదుకదా! అమ్మ బతుకుతే అదే చాలనిపించింది. అసలు పెళ్లే చేసుకోకుండా వున్నా సరిపోతుంది. ఏమిటో అనేక పిచ్చి ఆలోచనల్తో అలాగే కూర్చుండిపోయింది.

రాత్రి పదింటికి అమ్మకు తెలివివొచ్చింది; పోయిన ప్రాణి తిరిగి వొచ్చినంత ఆనందం కలిగింది తనకు; నాన్న మొహంలో కూడా సజీవకళ ప్రవేశించింది.

"అమ్మా!"-

అమ్మ కళ్ళు తెరిచి, ప్రశాంతంగా చుట్టూ చూసింది. క్షణంలో ఆమెకు అంతా అర్థమైనట్లుంది. ఆమె కంటివెంట నీరు వొస్తోంది. మీనాక్షి తల్లి కన్నీటిని తుడుస్తూ, దీనంగా 'అమ్మా!' అంది మళ్ళీ. పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే సంఘటన, ఎండుగడ్డి చిగిర్చే సంఘటనగా మారింది.

"మీనా!..." అంది అమ్మ, కూతుర్ని దగ్గిరికి లాక్కుంటూ.

"అమ్మా!.... కాస్త ఓవల్టిన్ తాగవూ?"

"తీసుకొనిరా-"

కూతురిచ్చిన ఓవల్టిన్ తాగింది. లోన అగ్ని పర్వతం చల్లారిన చిహ్నాలు ఆమె ముఖంలో కనిపిస్తున్నవి. ఎంతో ప్రశాంతంగా, యోగ నిద్రనుంచి కళ్ళు తెరిచినట్లుంది.

"అమ్మా! మందు తాగవూ-?"

"కాస్సేపుండి తాగుతాను... తల్లీ! భోంచేశావా? లేదు... నీ మొహం చూస్తేనే అర్థమౌతోంది. పోయి భోంచేసిరా..... నాన్న ఏరీ!... చూస్తూ నుంచున్నారా? అమ్మాయి అన్నం తినలేదని మరిచిపోయ్యారా! మీరూ అదీ భోంచేసిరండి... ముందు వెళ్ళండి-"

నాన్న ఆనందబాష్పాల్ని రాల్చటంలో నిమగ్నుడై వున్నాడు. అమ్మ మాటల్తో మళ్ళీ యీ లోకంలోకి పడ్డాడు.

"ముందు మీరు వెళ్ళండి - నేను అమ్మ దగ్గిర వుంటాను-" అంది మీనాక్షి.

"నాకేం తొందర? నిన్నటినుంచీ అన్నంలేదు; నీళ్ళులేవు... ముందు నీ వెళ్ళిరా-" అన్నాడాయన.

"పోయిరా తల్లీ!" అని అమ్మ మీనాక్షి తల నిమిరింది.

"నేను ఇక్కడే భోంచేస్తాను. భోజనం ఇక్కడికి పంపండి. మీరు భోంచేసి రండి" అంది మీనాక్షి. క్షణంలో అంతా రాజీ ఐపొయ్యారు. చిరకాల బాంధవ్యాలు అందరి హృదయాలనూ మెలేసి, ఒక్కచోట కట్టి పడేసినవి. ఎంత అల్ప సంఘటన మీద మానవుల ఆనందం ఆధారపడివుంది!

నాన్న వెళ్ళిపొయ్యాడు. భోజనం వచ్చింది. తల్లి పక్కమీదనే కూర్చొని మీనాక్షి భోంచేస్తోంది. తల్లి చూస్తూ తన సంతోషాన్ని వెలిబుచ్చలేక పోతోంది. అమ్మలాగు ఆదరించేవాళ్ళు తన కింకెవరున్నారు? యీ అమ్మ మాట కాదనే సాహసం తనలో లేదింక.

భోంచేశాక అమ్మ తల దగ్గిర కూర్చుంది. ఎంతో ఆపేక్షతో అమ్మను ముద్దుపెట్టుకుంది; అమ్మకూడా తనను దగ్గిరికి లాక్కొని, తలనిమురుతూ, కన్నీరు కార్చింది. ఎందుకింకా అమ్మ ఏడుస్తుంది? తను లొంగిపోయిన సంగతి ఆమెకు తెలియదేమో?... ఇప్పుడే ఆ విషయం చెప్పేద్దామనుకుంది కాని తిరిగి అదంతా తవ్వి, ఆమెను యీ స్థితిలో బాధించటం కూడదని వూరుకుంది.

"అమ్మా! మందు తాగవూ?"

"ఇవ్వు-"

అమ్మ మందుతాగింది. మూగభాషలోనే ఒకర్నొకరు పలకరించుకున్నారు; అర్థం చేసుకున్నారు; ఏకమయ్యారు. గండశిలలవంటి వారి పట్టుదలలు; కరిగి ప్రవహించి కలిసిపోయినవి. ఎవరు ఏదనే భేదం లేదు; వేరువేరు అభిప్రాయాలనేవి ఉన్నవనే జ్ఞానం లేదు. ఆ తల్లీ కూతుళ్ళు ఒక్కరే!

## 2

వారం రోజులపాటు శ్యామలాంబ మంచం దిగలేదు. రోజు రోజుకూ ఆమె ఆరోగ్యం బాగుపడుతూనే వుంది. జ్వరం రెండోనాటికే తగ్గిపోయింది. కాని గుండెదడ బాగా తగ్గలేదు. బ్లడ్ ప్రెషర్ కూడా తగ్గింది. కాని ఉద్రేకాలకు గురైతే యీసారి పక్షవాతం వొచ్చినా రావొచ్చని డాక్టర్ హెచ్చరించాడు.

మీనాక్షి బడి మానేసి అమ్మ దగ్గిరే వుండిపోయింది. అమ్మకు చేయవలసిన సేవకు మరో అవకాశం వుంటుందో లేదో నన్నంత ఇదిగా ప్రవర్తించిందామె. ఇంటిల్లపాదినీ వేధించి, నలిపి నల్లేరు చేసిన సమస్య సంగతే అందరూ మరిచిపొయ్యారు. ఎవరికైనా ఒకవేళ జ్ఞాపకం వున్నప్పటికీ దాన్నిగూర్చి మాట్లాడే సాహసం ఎవరికీ లేదు. శాశ్వతంగా అది భూస్థాపనయిందేమో?

శ్యామలాంబ మనస్సులో జరిగేదేమిటో అర్థంకావటం కష్టమేకాని, నిశ్శబ్దంగా కంటివెంట నీరు వెలువడుతూనే వుంది. మొదట్లో వేడి చేయటం వల్ల నేమోనని అందరూ భ్రమపడ్డారు; కాని, ఆమెను చాలా జాగర్తగా కనిపెడుతూన్న మీనాక్షికిమాత్రం ఆ కన్నీటి కాలువ వెనుక, ఒక మహాసాగరమే ఘోష పెడుతూందనీ, ఆ సాగరం తాలూకు అలల తాకిడే, మెరిసే అమ్మ కళ్ళల్లోంచి తొంగి చూస్తోందనీ తెలుసు. కాని ఆ ఆంతర్యం ఏమిటో తెలుసుకోలేదు; అడిగే ధైర్యం లేదు. ఎవరి ఆనందాన్ని వారు అనుభవించాల్సిందే; అదే విధంగా ఎవరి బాధను, దుఃఖాన్ని వారు అనుభవించి, వొదిలించుకోవల్సిందే మరి! నిస్సహాయంగా అమ్మ వైపు చూస్తూ కడుపున పుట్టిన తను ఏమీ చేయలేక పోతున్నాననే బాధ మీనాక్షిని వేధిస్తూనేవుంది.

శ్యామలాంబ చాలా విశ్రాంతి తీసుకుంటూనే వుంది. రోజులో పన్నెండుగంటలకు పైగా నిద్రపో గలుగుతోంది. ఇది చాలా మంచి లక్షణమన్నాడు డాక్టర్. యీ విశ్రాంతి వల్లనే ఆమె త్వరత్వరగా ఆరోగ్యాన్ని పుంజుకుంటోంది. నాన్న సంగతి చెప్పక్కర్లేదు. తిరిగి ఎన్ని యుగాలకు యీ యింటిలో శాంతి దేవత ప్రవేశిస్తుందోనని భయపడ్డ ఆయన, శాంతి దేవత మరి కదలకుండా ప్రతిష్ఠింప బడిందని తెలుసుకొని ఆనందించాడు.

మరో నాలుగు రోజులు గడిచేప్పటికి, శ్యామలాంబ మామూలు మనిషైంది. ఇప్పుడామె చాలా ఆరోగ్యంగా, పూర్వంకన్న కళ కళలాడుతూ వుంది. ఏదో కొత్తశక్తి వొచ్చిపడినంత ఉత్సాహం కనిపిస్తోంది.

ఒకనాటి మధ్యాహ్నం, మీనాక్షిని తన గదిలోకి పిలిపించింది. సోఫాలో తన పక్కనే కూతుర్ని కూర్చోబెట్టుకొని ముద్దుగా తల నిమిరింది. ఏదో అడిగేందుకూ, తనకు సలహా లిచ్చేందుకూ పిలిపించి వుంటుందని మీనాక్షికి తెలుసు. ఆ విషయం

కూడా ఏమిటో ఆమె వూహించుకోగలిగింది. కాని మళ్ళీ ఆ చరిత్రంతా తవ్వితే, ఆ ఇసక పాతర పెళ్ళగిస్తే తల్లి ఆరోగ్యం ఏమౌతుందోననే భయం ఆమెను కమ్మింది.

కాస్సేపు ఎవ్వరూ మాట్లాడలేదు. ఒకళ్ళ నొకళ్ళు చూసుకున్నారు. ఎక్కడో ఆ భేదాభిప్రాయం వున్నది. ఆ పగులు అతకటం ఎలాగా అని ఆలోచించుకుంటున్నారు.

కొంచెంసేపాగి "మీనా...నీ పెళ్ళి విషయం ఏం తేల్చుకున్నావ్?" అంది శ్యామలాంబ.

మీనాక్షి మాట్లాడలేదు. అమ్మకు ఫిట్ వొచ్చిననాడు ఒక్కక్షణంలో ఆమె చలపతిని విసిరి దూరాన పారేసింది; అతనికి మళ్ళీ తన హృదయంలో స్థానంలేదని భ్రమించింది. కాని ఆ విసరటంలో, అతను తన హృదయంలోనే దిగబడిపోయి, ఎంత పెళ్ళగించినా కదిలేట్లుగా కూడా లేడని తోచింది. వ్యక్తికీ వ్యక్తికీ వున్న దూరాల్ని లెక్కకట్టటంలో సామాన్యంగా పడే పొరపాటే తనూ పడింది. కాని యీసంగతులన్నీ ఇప్పుడు అమ్మతో చర్చించటం మంచిదా కాదా అని ఆలోచిస్తోంది. అందులోనూ యీసారి చర్చలో తను చాలా తీవ్రంగా, ఘోరంగా అమ్మను గాయపరచగల స్థితిలో వుంది. తనను కదపకుండా వుండటమే క్షేమకరమని బహుశా అమ్మకు తెలియదు. తెలిసివుండీ తను ఆ సుడిగుండంలోకి దూకటంకూడా మంచిదికాదు.

"మాట్లాడవేమే మీనా!.... నామీద కోపమా?" అందామె. లాలించి అడుగుతుంటే, మీనాక్షి కరిగిపోతోంది. ఒక పక్క ఆమె అంతరాత్మ హెచ్చరిక చేస్తూనేవుంది; కాని తల్లి లాలింపు ముందు, అంతరాత్మ ఘోష ఒక లెక్కలోది కాదు.

"నేనసలు పెళ్ళాడనే అమ్మా!" అంది.

"ఏం... ఎందుకనీ?" అందామె.

"కారణా లడగొద్దు. నా పెళ్ళి సమస్య ఎవరికీ కష్టం కలగకుండా పరిష్కరించేందుకు ఇదే మార్గం."

"అలాక్కాదమ్మా! నా మాట విను. నేను అమ్మనుకదూ?.... నా మాట విని ఆ రాజారావును పెళ్ళాడు-"

మీనాక్షి మాట్లాడలేదు. అయిష్టంగా తల వొంచుకుంది.

"మాట్లాడు...సిగ్గుపడే విషయం కాదు. నాతో చెప్పు. మనం చర్చిద్దాం -"

"వొద్దు. మళ్ళీ నీకు ఉద్రేకం వొస్తుంది; ఫిట్టు వస్తుంది. నాన్న కూడా యింట్లోలేడు-" అంది మీనాక్షి.

"నాకేమీరాదు. చాలా ప్రశాంతంగా వున్నాను. మాట్లాడు... తల్లీ! జవాబుచెప్పు. రాజారావు-"

"నాకా సంబంధం ఇష్టంలేదు. మీరు అంటగడితే, నన్ను జీవితాంతంవరకూ దుఃఖసాగరంలో పడేసినట్లే!"

"ఏం... ఎందుకనీ? రాజారావు బాగుంటాడు; మంచి మర్యాదలన్నీ ఉన్నవి. నీవు భాగ్యవంతుల ఇంటి కోడలివి కావాలని నా కోర్కె... వూళ్ళో సంబంధం..."

తల్లిలో ఉద్రేకం కనిపించటంలేదు; ఎవరిసంగతో మాట్లాడుతూన్నట్లు చాలా నిర్లిప్తంగా వుంది. అమ్మ మొహం చూశాక, తన హృదయాన్ని విప్పిచెప్పటం ప్రమాద మవదనే ధైర్యం కలిగింది మీనాక్షికి.

"ఏముంటేనేం, పెళ్లాడేది నేను; నాకు ఇష్టంలేదు."

"ఆ చలపతి అంటే ఎందుకిష్టం?"

"కారణం నాకు తెలియదు. నేను చెప్పలేను. నీవు నేనైతే తెలుస్తుంది-"

"యీ ప్రణయాలున్నయ్యే - ఇవన్నీ కట్టుకథలే! నిత్య జీవితాలకూ, పుస్తకాల్లోని పవిత్ర ప్రణయాలకూ సంబంధంలేదు. అందుకనే ఒకకవి 'ప్రణయం ప్రపంచంలో బతకలేదు కనుకనే, పుస్తకాల్లో తలదాచుకుంది' అన్నాడు... నా మాట విను-"

"నేను వినను-వినలేను" అంది మీనాక్షి, నిశ్చయాన్ని ధ్వనింపజేస్తూ. అన్నాక కాని, తాను తొందరపడ్డానేమోనని తోచలేదు. తల్లి మొహంలోని మార్పు కోసం వెతికింది; కాని తల్లి మొహం నవ్వుతూ, కళ కళలాడుతూ, చాలా ప్రశాంతంగా వుండక పోయినట్లయితే, మీనాక్షి చాలా బాధపడి వుండేది.

"మొండికెయ్యొద్దు. ఎందుకనో చెప్పు. ఆ చలపతి అంటే నీ కెందుకింత వ్యామోహం? రాజారావు ముందు చలపతి దిగతుడుపుక్కూడా పనికిరాడు కదా! దారినిబొయ్యే దానయ్యను పెళ్లాడుతావా? ఆ చలపతి..."

మీనాక్షికి మండి పోతోంది. లేని అవగుణాల్ని తనతల్లి చలపతిలో చూపేందుకు ప్రయత్నిస్తోంది. యీ విధంగా తన మనస్సు విరచాలని ఆమె తాపత్రయం. ఇందుకేనా పిలిచింది?

"నాకేం చెప్పొద్దు. నాకు చలపతంటేనే ఇష్టం."

"అదే - ఎందుకని అడుగుతున్నాను?"

మీనాక్షికి ఊపిరాడనంత బాధ కలిగింది. యీ కారణాలు ఎవ్వరూ చెప్పలేరని అమ్మకు తెలుసు; ఐనా ఆమె యీ అసంభవంవైపు తనను ఎందుకు తరుముతుంది? అనవసరంగా తనను రెచ్చగొట్టింది.

"నీకు...ఆ నాగభూషణమంటే - ఎందుకు అంత ఇష్టం?" అంది, మీనాక్షి. తీరా ఆ మాట అన్నాక నాలిక కొరుక్కుంది. చాలా దూకుడుగా, అనరానిమాట

అనేసింది. ఎట్లా వుపసంహరించుకోవటం? యీ ములుకుల్లాటి మాటల్తో తల్లి గిరగిరా నేలవాలి వుంటుందేమో? భయంవేసి తల్లి వైపు చూసింది.

శ్యామలాంబ నిశ్చేష్టురాలైంది. పర్వతాగ్రంమీద నుంచి జారి, తెలియకుండానే ఏ చెట్టుకొమ్మనో పట్టుకొని, బతికినట్లుగా అనిపించే వ్యక్తిలో కనిపించే అనుభూతి, ఆమె మొహంలో స్పష్టంగా కనిపించింది. యీ మాటలకు కూడా ఆమె తట్టుకుంది; మానసికంగా కూడా ఆమె చాలా ఆరోగ్యంగా వుందని రుజూ ఐంది.

–కాని మీనాక్షి తల్లి మొహంలోకి ఎక్కువసేపు చూడలేకపోయింది. భూతదయకు తోడు, కన్నతల్లికి చేసే ద్రోహానిక్కూడా వొడి గట్టిన బాధ ఆమెను పిండింది. అరిచేతుల్లో ముఖాన్ని దాచుకొని గాద్గదికంగా "అమ్మా!.... క్షమించు...పొరపాటున అన్నాను–" అంది.

శ్యామలాంబ కూతురు తల నిమిరింది.

"చెప్పుతల్లీ!... నీ వేమనదలిచావో అంతా అను... నేను ఏమీ అనుకోను–" ఎంత ప్రశాంతంగా అడిగింది! ఐనా మళ్ళీ ఆ ఉద్రేకం వొస్తేనే కాని తాను ఏమీ అనలేదని అమ్మకు తెలియదేమో?

"మాట్లాడవేం–మీనా!"

"ఏం లేదమ్మా!...నేను కారణం చెప్పలేను – అంతే!'

"అదికాదు...నాగభూషణం సంగతి నీకెలా తెలిసిందీ? నీవే మనుకుంటున్నావ్? దాచకుండా చెప్పు–"

"ఏం లేదు–"

"చెప్పవ్ కదూ? అసలు నీకెలా తెలిసిందీ? ఇదివరకు నీకు తెలిసిందేమోనని భయంగా వుండేది. ఇప్పుడా భయంలేదు. మాట్లాడు మీనా!"

కాస్సేపు మీనాక్షి మాట్లాడలేదు. తనలో మనోధైర్యాన్ని కలిగించేందుకు తల్లి వీపు తట్టింది; లాలింపుగా దువ్వింది; బతిమాలే ధోరణిని సూచించేందుకు గడ్డం పట్టుకుంది. యీ మంచిలో విషమైనాసరే తను తాగక తప్పదనిపించింది మీనాక్షికి.

"నీవు జబ్బుగా వున్నప్పుడు డ్రాయర్లో ఉన్న ఉత్తరాలూ అవీ చూశాను. చలపతిని పెళ్ళాడేందుకు నిన్ను బెదిరించి, భయపెట్టాలని నా ఉద్దేశ్యం కాదు. నాన్నక్కూడా తెలియనీను. అందువల్ల ఏం లాభం? అంతా గతించిపోయిన చరిత్రాయె!"

యీ చిన్నది ఇంత తెలివిగా మాట్లాడుతుందని శ్యామలాంబ అనుకోలేదు. తన పరువు ప్రతిష్ఠల్ని కాపాడగలిగే కూతుర్ని కన్నందుకు ఆమె గర్వపడింది కూడా.

"ఔను...ఏం లాభం?... ఆ నాగభూషణంపోయి రెండేళ్ళయింది!" అంది, తనలో తాను మాట్లాడుకునే ధోరణిలో. శ్యామలాంబ కళ్ళముందు ఆ మధుర దృశ్యాలన్నీ

ఆడుతూన్నవేమో - ఆనందబాష్పాలు రాలుతూన్నవి. వాటి జ్ఞాపకాలలో ఆమె తన్మయత్వం చెందుతోంది. మీనాక్షి తల్లిని అటూ ఇటూ కదిపింది. ఆమె తేరుకొని "వింటున్నాను - చెప్పమ్మా - చెప్పు-" అంది.

"ఏముంది చెప్పేందుకు? ఆ నాగభూషణమే నా అసలు తండ్రి అని నీవెప్పుడూ నాకు చెప్పలేదు. ఎట్లా చెప్పగలవ్? అది మీ ఇద్దరికీ తెలిసిన రహస్యమాయె! నీ చిన్ననాటి స్నేహితుడల్లే మనింటికి వొచ్చే వాడు. నేనూ నాన్న కూడా ఆ భ్రమలోనే ఉన్నాం. కాని నా తండ్రి ఎవరో తెలుసుకునే అవకాశంకూడా నాకు ఎందుకివ్వలేదు? ఆయన్ను నేనా దృష్టితో చూసి గౌరవించలేదు కదా! అంతా నటన! యీ నటనలో మానవహృదయాలు ఎంత గాయపడి పోయినవో చూసే తీరికన్నా లేదు. అమ్మా! నాగభూషణం నాన్న కన్న ఏం గొప్పని, అంతగా ప్రేమించావ్?'

జవాబు చెప్పలేదు శ్యామలాంబ; ఎవరు మాత్రం చెప్పగలరు? అనుభవించి తెలుసుకోవాల్సిందే.

"నాకు తెలుసమ్మా!... ఆ నాగభూషణం పోయినప్పటినుంచే నీకీ ఫిట్స్ రావటం. ఒకో వ్యక్తిమీదవుండే అనురాగమను, ఆపేక్షను, ఆ వ్యక్తి ప్రతి రక్తకణంలోనూ కలిగించే నవరసాలను, కనుపాపల్లో, కంటి చివరల్లో శరీరమంతటా పాకించే విద్యుత్ అను, ఇంకేమన్నా అను- ఆ వ్యక్తివలె మరెవ్వరూ కదపలేరు. ఆ వ్యక్తికోసం పడి చావటంలో పై వాళ్ళకు వింత కనిపించవచ్చు. కాని అనుభవపూర్వకంగా తెలిసిన నీకు -"

మీనాక్షి తల్లివైపు చూసింది; ఆమె అలాగే నోరు సగానికి తెరిచి ఆలోచనల్లో పడిపోయింది. కూతురు మాట్లాడే ప్రతి అక్షరంలోని కదలికా, వంకరా ఆమె హృదయాన్ని మెలేసి, భావ పరంపరలో ముంచెత్తుతున్నది.

"మాట్లాడు మీనా! మాట్లాడు. నీలాగా నా మీద సానుభూతి చూపేవాళ్లు లేరు. నీలో నాగభూషణాన్ని చూడగలను - మాట్లాడు... నేను బాధపడను. మరిచిపోయిన మధురస్మృతులకు మళ్ళీ ప్రాణాన్నివ్వు - మీనా!" యీ విచిత్రానుభూతికి తల్లి తట్టుకోగలదని మీనాక్షి ఎప్పుడూ అనుకోలేదు. కాని చూసికూడా నమ్మలేకపోవటం ఆమె వల్ల కాలేదు.

"అమ్మా! యీ ద్వంద్వ జీవితాల్ని గడపటం బాధాకరం కాదా? ఇప్పుడు ఏ కారణాల వల్ల నేను చలపతిని వివాహ మాడరాదని నీవు అంటున్నావో, అనగలుగుతున్నావో, అవే కారణాలవల్ల నీ వివాహం నాగభూషణంతో అవలేదు. ఆనాడు స్వాతంత్ర్యం నీచేతుల్లోలేదు. పరిస్థితులకు తలవొగ్గి, నన్ను కడుపులో పెట్టుకొని యీ యింటికి ఇల్లాలుగా వొచ్చావు. ఆ నాగభూషణం లేకుంటే నీవేం సుఖపడేదానివి? యీ చాటుమాటు వ్యవహారమంతా ఎందుకు జరిగింది? ఆ నాగభూషణంతోనే

పెళ్ళయితే కష్టమో, సుఖమో సంతోషంగా భరించేదానివి కదా! ఇక్కడ యింత ఐశ్వర్యం నిన్ను సుఖపెట్టలేక పోయిందే! అక్కడ ఉన్నంతలోనే జీవితం గడిచేది. అక్కడి గంజిరుచి, ఇక్కడ మృష్టాన్నానికి లేదు. అక్కడి పూరిపాక సుఖం, యీ బంగళాలో ఫాన్ల చల్లని గాలికింద ఉండదు. అక్కడి కాలినడక సౌఖ్యం, ఇక్కడి కార్లలో కనిపించదు. ఎందుకని? నీవిక్కడ ఎంత సుఖపడ్డావో, నేను రాజారావును పెళ్లాడినా అంతేకదా!"

కూతురు ఎంతబాగా చెపుతోందో ననిపించింది. నాగభూషణం తెలివంతా దీని కళ్ళల్లోనే కనిపిస్తోంది. తన మాతృత్వం నిజంగా ధన్యమైందనిపించిందా తల్లికి.

"మాట్లాడు –మీనా! మాట్లాడు!"

"నీ తరంలో జరిగిన పొరపాట్లే, నీ తరువాతి తరంలో కూడా జరిపించాలని నీకు వుందా? నీ బాధలే నేనూ పడాలా? నీ నటనే నాకు ఆదర్శప్రాయమా? నాగభూషణం బిడ్డనయ్యానని కించపడను; ఎవరికో ఒకరికి బిడ్డనే అవాలికదా! ఐతే రాజమార్గాలు వొదిలి, యీ సందుగొందుల్లో జీవితాన్ని గడపాల్సిందేనా? అందులోనూ అవకాశాలు చేతులకు అందుతుండగా; నీకన్న నేను ఎక్కువ సౌఖ్యపడరాదని నీ అభిప్రాయమా? జలసీయా? లేక వయసుమళ్ళాక, ఆ పాతగాథంతా మరిచిపోయి ప్రణయమనేది మిథ్య అనే వేదాంతమా? మిధ్యే అవుగాక, దానికోసం తపించటం, ఆహుతి కావటానికి ఎవరు వెనుకాడుతారు? ఆ అనుభూతితో బూడిదైతే మాత్రమేం? ఒకవేళ పొరబడినా, దాన్ని దిద్దుకునేందుకు ఎంత జీవితం లేదు? ఆ ఏడవాల్సింది ఇప్పుడే, ఇక్కడే మొదలవాలా? యీనాడు నా యీ సమస్యను విడదీయటం నీ చేతుల్లో వున్నప్పటికీ, నీ అనుభవాల సారాన్ని నాకు అందకుండా చేసి, నన్నూ ఆ కూపంలోకి తోసెయ్యాలని ఎందుకు చూస్తావు? ఎన్ని తరాలకు మనుషులు మారతారు? ఏదో దివ్యశక్తులు ఆకాశంలోనుంచి వర్షించాల్సిందేనా? ఎవరివొంతు వాళ్ళు చేస్తే యీ అవస్త ఎందుకు–"

శ్యామలాంబ కూతుర్ని కావలించుకుంది. ఉద్వేగంతో వొణికి పొయ్యే మీనాక్షి, తన తలను అమ్మ రొమ్ముల్లో దాచుకుంది. అమ్మ విడిచే వెచ్చని, ఉప్పని కన్నీరు – కన్నీరా అది? – అనుభవాలు కరిగిపోసిన సీసం – బొట్టుబొట్టుగా మీనాక్షి ఫాలభాగం మీద పడుతోంది.

"గెలిచావు మీనా! నా కళ్ళు తెరిచావు. శాశ్వతంగా భూస్థాపితమయిందనుకున్న చరిత్రను తవ్వి నాకు జ్ఞానోదయం చేశావు. చలపతితో నీ పెళ్ళి జరుగుతుంది. నీ సుఖసౌఖ్యాలు నావికావా? నా నోముల పంటవే తల్లీ!"

తల్లీకూతుళ్లు అలాగే చాలాసేపు ఉండిపొయ్యారు.

## 3

"వీల్లేదు..వీల్లేదు" అన్నాడు ప్లీడర్. తల్లీ కూతుళ్ల సంప్రదింపులన్నీ విని, "నా కంఠంలో ప్రాణముండగా ఆ చలపతితో అమ్మాయి వివాహం జరిగేందుకు వీల్లేదు."

తల్లీ కూతుళ్లు ఆశ్చర్యపొయ్యారు.

ఒకరి మొహంలోకి మరొకరు చూసుకొన్నారు. వారికేమీ అర్థం కాలేదు.

"ఒక్కగాని ఒక్క పిల్ల. అది సుఖపడుతుంది. మనకేం తక్కువ? చలపతయితే ఇంట్లోనే పడివుంటాడు" అంది తల్లి. పులిలాంటి తల్లి, పిల్లయింది. ఆమె కంఠస్వరంలో వేడికోలుతప్ప, ఆజ్ఞాపించే ధోరణేలేదు. సామ్రాజ్య భ్రష్టతను పొందిన మహారాజ్ఞివలె వుంది.

"నేనంతా ఆలోచించాను. ఇదివరకు నీవన్నదంతా నిజమే! నేను మీనా కూడా పొరబడ్డాం. రాజారావు సంబంధమే ఖాయం చేశాను - ముహూర్తం పెడుతున్నారు-"

"అంత తొందరెందుకు? ...కాస్త ముందు వెనుకలు ఆలోచించండి" అంది తల్లి.

"ఆలోచనా?" అని వికటంగా నవ్వి అన్నాడాయన "ఇంకా ఆలోచించేదేమిటి? ఒకసారి యీ రభస అవనే ఐంది. ఇద్దరూ చెరో గదిలోనూ అలిగి కూర్చున్నారు; నీవేమో చచ్చి బతికావు. యీ ముసలితనంలో యీ బాధలు మరివొద్దు. ఏమీ పనిలేనివాళ్ళకు వెధవ ఆలోచనలన్నీ వొస్తూంటవి. ఏది మంచో, ఏది చెడ్డో నాకు తెలుసు. సంసారమంతా ఒక్క వ్యక్తి మీద నడవాలి - అంతే!"

ప్లీడర్‌గారు చాలా ఉద్రిక్తంగా మాట్లాడుతున్నారు. ఇదివరకెప్పుడూ ఆయన కంఠస్వరంలో కంచుధ్వనిలేదు. నిర్జీవమైనవికూడా అదిరి పడేట్లు గర్జిస్తున్నాడాయన. మీనాక్షి భయపడిపోయింది. కాని శ్యామలాంబ ఎదుర్కొనేందుకే సిద్ధమైంది.

"పెళ్ళికి దాని - దాని ఇష్టప్రకారం....?"

ఆమెమాట పూర్తిగాకుండానే ప్లీడర్ గారు అరిచాడు : "యిన్ని యిష్టాలకు యీ కొంపలో తావులేదు. నోరుమూసుకొని పడివుండండి. చేతనౌనని ముందుకొచ్చి, బరువు మోయలేక కిందపడి గిజగిజా తన్నుకునేందుకు నేను నిన్ను అనుమతించను. నాకూ పరువుమర్యాదలున్నయ్. మంచి మర్యాదలున్న కుటుంబంతోనే వియ్యం పొందుతాను. నాకెవరూ చెప్పక్కర్లేదు. నేను వినను - అంతే!"

నాన్న ఇంత మొండికేస్తాడని మీనాక్షి ఎన్నడూ వూహించలేదు. ఇంత నిశ్చయంగా ఆయన మాట్లాడుతూంటే ప్రకృతి శక్తుల్నే ఆజ్ఞాపిస్తూన్నట్లుంది.

"మీరు కాస్త శాంతంగా..." అంటోంది అమ్మ.

"నేను మాట్లాడేది మీరెవ్వరూ వినిపించుకో దలచుకోలేదా? నా కింకా మతిపోలేదు. నీకు శారీరకంగా ఆరోగ్యం వొచ్చింది...కాని మతి చలిస్తోంది. చలపతినే అమ్మాయి పెళ్ళాడాలని వుంటే, ఆ డ్రాయర్‌లో వున్న రివాల్వర్ నా మీద ఉపయోగించు...చేతకాదు; కాదు – ధైర్యం లేదు – ఆడవాళ్ళ పెత్తనం ఏమిటి?...మనం ఒక సమాజంలో వున్నాం. ఎవరిష్టం వొచ్చినట్లు వారు ప్రవర్తించేందుకు వీల్లేదు. ఇది నాయిల్లు – నా యిష్టం!.. మాట్లాడకు.. నోరుముయ్! .... యింట్లోంచి గెంటిస్తాను.. జాగర్త!"

ప్రళయకాల రుద్రుణ్ణి చూసినట్లయింది తల్లీ కూతుళ్ళకు. అగ్ని పర్వతం సమీపంలో బద్ధలైందనీ, ఆ లావా తమ మీదికి విరుచుకొని పడుతుందనే జ్ఞానమన్నా లేదు. కాని అదృష్టవశాత్తూ ఆ అగ్నిపర్వతపు వేడికి అగ్నిపర్వతమే దహించుకొని పోతోంది.

ప్లీడర్ గారు లేచి నిలబడి అరుస్తూన్న వాడల్లా విరుచుకుని నేలమీద పడ్డాడు.

తల్లీ కూతుళ్ళు ఉపచారాలు చేస్తూండగా డాక్టర్ వొచ్చాడు. అంతా పరీక్షచేసి "ఫిట్ వొచ్చింది. నరాల బలహీనం...బ్లడ్ ప్రెషర్ కూడాను... యీ వయస్సులో ఎక్కువ ఉద్రేక పడకూడదు. రోగి మనస్సు కనిపెట్టి ప్రవర్తించాలి. లేకుంటే చాలా ప్రమాదం జరగొచ్చు" అని ఇంజక్షన్ ఇచ్చి వెళ్ళాడు.

తన పెళ్ళి ఎవరి ప్రాణానికో ఎసరు పెట్టటంగా మారుతుందని మీనాక్షి అనుకోలేదు. అమ్మ మొహంలోకి చూసింది. అసహాయ స్థితిలో వున్న అమ్మక్కూడా దిక్కుతోచక, ఎదురుగావున్న భగవంతుని విగ్రహంవైపు చూస్తోంది.

ఎంతలో ఎంతమార్పు! ఎవరెలా మారతారో ముందుగా తెలుస్తే అందుకు అనుకూలంగానే మిగతావాళ్ళు కూడా మారుతూంటే సరిపోతుంది. కాని అదే జీవిత రహస్యంగా వుంది. యీ మార్పుల్ని ఒక క్రమం లేకుండానే లాక్కొస్తోంది. దీనికి కర్తలూ, కర్మలైన వాళ్ళకే తెలియదు. మీకూ, నాకూ ఎలా తెలుస్తుంది?

మర్నాటి ఉదయానికి ప్లీడర్ గారికి తెలివివొచ్చింది.

"ఎక్కడ, మీనాక్షి ఎక్కడ," అన్నారాయన.

"నాన్నా!–" అందామె ముందుకువొస్తూ.

"నీ పెళ్ళి రాజారావుతో అవుతుంది. నీకు ఇష్టమా? కాదా? ఒక్క మాటలో చెప్పు. ఊఁ!" అన్నాడాయన. ఆ నీరసంలోనే ఆయన గొంతు ప్రతిధ్వనించింది. రోగి మనస్సు గుర్తించి ప్రవర్తించకుంటే ప్రమాదమని డాక్టర్ హెచ్చరిక చేశాడు. తన కన్నీటిని ఇతరులకు పంచటం అర్థం లేదనిపించింది మీనాక్షికి. అందులోనూ తండ్రి యీ స్థితిలో ఉండగా!

"నీ ఇష్టమే నా యిష్టం నాన్నా!" అందామె.

మీనాక్షిని దగ్గిరికి లాక్కున్నాడు. ఆయన మొహం క్రమంగా ప్రశాంతమైంది.

“చూడు... దానికున్న మాత్రం బుద్ధి నీకు వుందా? మీనా!... నా మాట దక్కించావ్! కలకాలం సుఖపడు తల్లీ!” అన్నాడాయన భార్యను చూస్తూ.

“నీకు యిష్టంలేదు - పోనీ... నేను బలవంత పెట్టను... మా ఇద్దరి మధ్య నీవు ఎవతెవు - ఇది నా కన్నకూతురు. నా మాట కాదనదు” అన్నాడా పిచ్చితండ్రి, మీనాను బుజ్జగిస్తూ.

తను ఒంటరి ఐనందుకు శ్యామలాంబ విచారించలేదు. కాని తన ముద్దుల కూతుర్ని దుఃఖసముద్రంలోనుంచి రక్షించలేని నిస్సహాయతకు విచారించింది. విచారించి చేసేదేమిటి? ప్రపంచం ముందుకు సాగుతోంది. దాంతోపాటే తనూ ముందుకు సాగాలి. సాగనని మొండికేస్తే కాలం బలవంతాన లాక్కువెళ్తుంది. శ్యామలాంబ కాలానికి కట్టుబడని అతీతురాలు కాదుమరి!

మార్పులు జరుగుతూనే వున్నవి; మనుషులు మారుతూనే వున్నారు; యీ మార్పుల ఫలితం కాలమే నిర్ణయిస్తుంది; బతుకు భారాన్ని లాగుతూ ఫలితాన్ని తెలుసుకోవాల్సిందే కాని, మరోదారి లేదు... కాని యీ మార్పులన్ని తన జీవిత చరిత్రనే, కూతురు జీవితచరిత్రగా చేస్తవని శ్యామలాంబకు తెలుసు. స్థూలంగా చూస్తే లోకం ముందుకు సాగుతూ వున్నట్లూ, అన్ని మారుతూన్నట్లే కనిపిస్తుంది - కాని నిజానికి మారిందేముంది? రంగు మారినా వస్తు గుణగణాలు మారలేదు - అంతా చర్విత చర్వణమే అని శ్యామలాంబకు తెలుసు... తెలిసినా ఏమీ చెయ్యలేక నిట్టూర్చింది - అంతే!

*రచన :- ఏప్రిల్ - 1955*